

READ PASTOR PRABHU KIRAN · 2 యోహాను 1–13

సత్యప్రేమలు

Walking in Truth and Love

పాస్టర్ జాన్ ప్రభు కిరణ్

> *“సత్యప్రేమలు మనయందుండగా తండ్రియైన దేవుని యొద్దనుండియు, తండ్రియొక్క కుమారుడగు యేసుక్రీస్తునొద్దనుండియు కృపయు కనికరమును సమాధానమును మనకు తోడగును.”*
>
> 2 యోహాను 3

ఒక ఊరిలో ఇద్దరు డాక్టర్లు ఉండేవారు. ఒక రోజు సుబ్బారావు గారు ఒకరి దగ్గరకు, వెంకటేశ్వర్లు గారు ఇంకొకరి దగ్గరకు వెళ్ళారు. ఇద్దరికీ షుగర్ చాలా ఎక్కువగా ఉంది.

మొదటి డాక్టర్ చాలా మంచి మనిషి. ఎప్పుడూ నవ్వుతూ మాట్లాడతాడు. రోగి బాధపడకూడదని, “ఏమీ కాదులెండి, మీకు ఇష్టమైనది తినండి, బాగానే ఉంటారు” అన్నాడు. చేదు మందు ఇవ్వలేదు, పథ్యం చెప్పలేదు. సుబ్బారావు గారు సంతోషంగా ఇంటికి వెళ్ళారు. కొన్ని నెలల తర్వాత ఆయన కాలు తీసేయవలసి వచ్చింది. ఆసుపత్రి మంచం మీద పడుకొని, “ఆ రోజే ఆ డాక్టర్ నిజం చెప్పి ఉంటే...” అని కన్నీళ్ళు పెట్టుకున్నారు.

రెండవ డాక్టర్ నిజమే చెప్పాడు. కానీ వెంకటేశ్వర్లు గారి మొహం కూడా చూడకుండా, “నీ నిర్లక్ష్యం వల్లే ఇది వచ్చింది. ఇలాగే ఉంటే చచ్చిపోతావ్” అని గద్దించి, చీటీ చేతిలో పెట్టాడు. ఆయన తలవంచుకొని బయటికి వచ్చారు. ఆ చీటీని జేబులోనే నలిపేశారు. జబ్బు కంటే ఆ అవమానమే ఆయనను ఎక్కువ బాధపెట్టింది. మళ్ళీ ఆ ఆసుపత్రి గుమ్మం తొక్కలేదు.

మొదటి డాక్టర్ దగ్గర ప్రేమ ఉంది, సత్యం లేదు. రెండవ డాక్టర్ దగ్గర సత్యం ఉంది, ప్రేమ లేదు. ఇద్దరు రోగులూ నష్టపోయారు. వాళ్ళకు నిజంగా కావలసింది, చేయి పట్టుకొని “భయపడకండి, నేను మీతో ఉన్నాను. కానీ ఈ జబ్బు నిజమైనది, ఈ మందు తప్పక వేసుకోవాలి” అని చెప్పే డాక్టర్.

ఈ ఇద్దరు డాక్టర్లు ఆసుపత్రులలోనే కాదు, మన మధ్యనే ఉన్నారు. బహుశా మనలో చాలామంది ఏదో ఒక రోజు వీళ్ళ దగ్గర రోగులుగా గాయపడినవాళ్ళమే. ఒక సంఘంలో ఎవరు వచ్చినా స్వాగతం, ఏ బోధ చెప్పినా “ఆమేన్.” కానీ అక్కడ సత్యానికి కాపలా లేదు. ఇంకొక

సంఘంలో ప్రతి వచనం సరిగ్గా తెలుసు, కానీ అక్కడ సహోదరులు ఒకరితో ఒకరు మాట్లాడుకోరు.

సమాజం కూడా ఇలాగే ఉంది. "ఎవరి నమ్మకం వాళ్ళది, అన్ని దారులూ దేవుని దగ్గరకే" అంటుంది. తప్పును తప్పు అని చెప్పడమే తప్పు అంటుంది. ఇది ప్రేమలా కనిపిస్తుంది, కానీ దానిలో సత్యం లేదు. అదే సమాజంలో ఒకరి తప్పు బయటపడగానే సోషల్ మీడియాలో అందరూ రాళ్ళు వేస్తారు. చెప్పింది నిజమే కావచ్చు, కానీ ఆ మనిషి తిరిగి లేవడానికి ఎవరూ చేయి అందించరు. ఇది సత్యంలా కనిపిస్తుంది, కానీ దానిలో ప్రేమ లేదు.

సంఘంలో, ఇంట్లో, సమాజంలో మీరు ఏ డాక్టర్ లాగా ఉన్నారు?

"చేర్చుకొనుము," "చేర్చుకొనవద్దు"

గత వ్యాసంలో ఫిలేమోను పత్రిక గురించి చదివాము. అక్కడ పౌలు ఫిలేమోనుతో, *"నన్ను చేర్చుకొన్నట్టు అతనిని చేర్చుకొనుము" అన్నాడు (ఫిలేమోనుకు 17).* ఇప్పుడు అదే బైబిలులో అపొస్తలుడైన యోహాను వేరే మాట చెబుతున్నాడు: *"వానిని మీ యింట చేర్చుకొనవద్దు"* (2 యోహాను 10).

ఒక చోట "చేర్చుకొనుము," ఇంకొక చోట "చేర్చుకొనవద్దు." బైబిలు తనకు తానే విరుద్ధంగా మాట్లాడుతోందా? కాదు. ఈ చిక్కుముడికి జవాబు యోహాను రెండవ పత్రికలోనే ఉంది.

ఒక పోస్ట్‌కార్డ్ ఉత్తరం

ఈ పత్రికను రాసినవాడు తనను తాను "పెద్దను" అని పిలుచుకున్నాడు (2 యోహాను 1). ఇతడు యేసుప్రభువు శిష్యుడు, అపొస్తలుడైన యోహాను. అప్పటికి అతడు వృద్ధుడు. సుమారు క్రీ.శ. 90 ప్రాంతంలో, బహుశా ఎఫెసు నుండి ఈ ఉత్తరం రాశాడు.

మూలభాషలో సుమారు 245 పదాలు మాత్రమే ఉన్న ఈ ఉత్తరం ఒక పోస్ట్‌కార్డ్ అంత చిన్నది. కానీ ఈ చిన్న పోస్ట్‌కార్డులో సంఘాన్ని కాపాడే పెద్ద సందేశం ఉంది.

యోహాను ఈ ఉత్తరాన్ని *"ఏర్పరచబడినదైన అమ్మగారికిని ఆమె పిల్లలకును"* రాస్తున్నాడు (వ. 1). అంటే ఒక స్థానిక సంఘమూ దాని సభ్యులూ అని చాలామంది పండితులు భావిస్తారు. దుర్బోధకుల గురించి హెచ్చరించే ముందు, "మీరు దేవుడు ఏర్పరచుకున్న ప్రజలు, ఆయన చేతిలో భద్రంగా ఉన్నారు" అని యోహాను వారికి గుర్తుచేస్తున్నాడు.

ఆ రోజుల్లో బోధకులు ఊరూరా తిరుగుతూ, విశ్వాసుల ఇళ్ళలో ఉంటూ బోధించేవారు. వారిలో కొందరు "యేసుక్రీస్తు నిజంగా శరీరధారియై రాలేదు" అని బోధించే దుర్బోధకులు కూడా ఉన్నారు.

యోహాను సందేశం ఇది: సత్యం లేని ప్రేమ మోసపోతుంది. ప్రేమ లేని సత్యం గాయపరుస్తుంది. డాక్టర్ల భాషలో చెప్పాలంటే, "ఆపరేషన్ సక్సెస్, కానీ పేషెంట్ చనిపోయాడు." వాదన గెలిచాము, వచనం సరిగ్గా చెప్పాము, కానీ సహోదరుని పోగొట్టుకున్నాము. అందుకే పౌలు ఇలా అంటున్నాడు: *"ప్రేమగలిగి సత్యము చెప్పుచు క్రీస్తువలె ఉండుటకు, మనమన్ని విషయములలో ఎదుగుదము"* (ఎఫెసీయులకు 4:15).

దేవుడు ఈ రోజు మనకు ఒక్క మాట చెబుతున్నారు: **మీరు సత్యములోను ప్రేమలోను నడుచుకోవాలి.** ఎలా నడుచుకోవాలి? ఈ చిన్న పత్రికలో యోహాను మూడు విధానాలు చూపిస్తున్నాడు.

మొదటి విధానం: ప్రేమను సత్యముపై నిలుపుకోవాలి

ఒకే ఇష్టం ఉన్నవాళ్ళు త్వరగా కలిసిపోతారు. ఒకే హీరో అభిమానులు రిలీజ్ రోజు థియేటర్ దగ్గర కలిస్తే, ఎప్పుడూ చూడకపోయినా అన్నదమ్ముల్లా కౌగిలించుకుంటారు. వాళ్ళను కలిపింది ఏమిటి? వాళ్ళందరూ ఒకే విషయాన్ని ప్రేమిస్తున్నారు.

మరి యోహానును, ఆ సంఘాన్ని కలిపింది ఏమిటి? యోహానే చెబుతున్నాడు: *"నేనును, నేను మాత్రమే గాక సత్యము ఎరిగినవారందరును, మనలో నిలుచుచు మనతో ఎల్లప్పుడు ఉండు సత్యమునుబట్టి మిమ్మును నిజముగా ప్రేమించుచున్నాము"* (2 యోహాను 2). ఆ సంఘం మీద యోహానుకు ఉన్న ప్రేమ కుటుంబ బంధం వల్లనో, అభిమానం వల్లనో, లాభం వల్లనో రాలేదు. యోహానూ ఆ సంఘమూ ఒకే సత్యాన్ని నమ్ముతున్నారు. అదే వారిని కలిపింది.

యోహాను దృష్టిలో సత్యం అంటే కొన్ని సరైన విషయాల జాబితా మాత్రమే కాదు. సత్యం ఒక వ్యక్తి: *"యేసు నేనే మార్గమును, సత్యమును, జీవమును; నా ద్వారానే తప్ప యెవడును తండ్రియొద్దకు రాడు"* (యోహాను 14:6).

ఈ సత్యం "మనలో నిలుచుచు మనతో ఎల్లప్పుడు ఉండు సత్యము." అది ఆదివారం విని మరచిపోయే సందేశం కాదు. సినిమా వంద రోజులు ఆడి వెళ్ళిపోతుంది, హీరో కూడా ఒక రోజు ముసలివాడవుతాడు, కానీ సత్యం నిత్యమైనది. కాబట్టి దాని మీద నిలిచిన ప్రేమ కూడా నిలుస్తుంది.

అందుకే యోహాను ఈ దీవెన పలుకుతున్నాడు: *"సత్యప్రేమలు మనయందుండగా తండ్రియైన దేవుని యొద్దనుండియు, తండ్రియొక్క కుమారుడగు యేసుక్రీస్తునొద్దనుండియు కృపయు కనికరమును సమాధానమును మనకు తోడగును"* (2 యోహాను 3). సత్యం, ప్రేమ రెండూ కలిసి ఉన్న చోటే దేవుని దీవెనలు నిలుస్తాయి.

మీ ఇంట్లో, మీ సంఘంలో, మీ స్నేహాలలో మీ ప్రేమ దేని మీద నిలబడింది? పెళ్ళి రోజు ఉన్న ఆకర్షణ, ఇరవై ఏళ్ళ తర్వాత ఆసుపత్రి మంచం పక్కన రాత్రంతా కూర్చున్నప్పుడు ఉండదు. అప్పుడు నిలబెట్టేది భావం కాదు, దేవుని ముందు చేసిన నిబంధన. భావాల మీద కట్టిన ప్రేమ కూలిపోతుంది. సత్యం మీద కట్టిన ప్రేమ నిలబడుతుంది. అందుకే రోజుకు పది నిమిషాలైనా కుటుంబమంతా కలిసి వాక్యం చదివి ప్రార్థించండి. కలిసి సత్యాన్ని ప్రేమించేవాళ్ళే కలిసి నిలబడతారు.

సత్యం పునాది అని చూశాము. మరి ఆ సత్యంలో ఎలా నడవాలి?

రెండవ విధానం: విధేయతతో ప్రేమను చూపించాలి

హైదరాబాద్‌లో ఉద్యోగం చేసే ఒక అబ్బాయి మదర్స్ డే రోజు పాత ఫోటో ఒకటి పెట్టి, "My Mom is my World" అని స్టేటస్ పెట్టాడు. ఊరిలో ఒంటరిగా ఉన్న ఆ అమ్మ మాత్రం మిగిలిన 364 రోజులు కొడుకు ఫోన్ కోసం ఎదురుచూస్తుంది. ఆమె మందులు వేసుకుందో లేదో, తిన్నదో లేదో అతనికి పట్టదు. అమ్మ ఫోన్ చేస్తే "బిజీగా ఉన్నానమ్మా" అని కట్ చేస్తాడు. మీరే చెప్పండి, అతని ప్రేమ స్టేటస్‌లో ఉందా, జీవితంలో ఉందా?

ప్రేమ ఒక రోజు స్టేటస్‌లో కాదు, ప్రతిరోజు నడకలో కనబడుతుంది. యోహాను ఇలా రాస్తున్నాడు: *"తండ్రివలన మనము ఆజ్ఞను పొందినప్రకారము నీ పిల్లలలో కొందరు సత్యమును అనుసరించి నడుచుచుండుట కనుగొని బహుగా సంతోషించుచున్నాను"* (2 యోహాను 4). యోహాను సంతోషించింది వారు సత్యం తెలుసుకున్నందుకు కాదు, సత్యంలో నడుస్తున్నందుకు.

యోహాను వారికి క్రొత్త ఆజ్ఞ ఏమీ ఇవ్వడం లేదు. *"మొదటనుండి మనకు కలిగిన ఆజ్ఞనే వ్రాయుచు, మనము ఒకరి నొకరము ప్రేమింపవలెనని"* వేడుకుంటున్నాడు (వ. 5). చివరి భోజనపు రాత్రి యోహాను ఈ మాటను ప్రభువు నోటినుండే విన్నాడు (యోహాను 13:34).

లోకం ప్రేమను ఒక భావనగా చూస్తుంది. బైబిలు ప్రేమను విధేయతగా చూస్తుంది. యోహాను ఇచ్చిన నిర్వచనం ఇదే: *"మనమాయన ఆజ్ఞలప్రకారము నడుచుటయే ప్రేమ; మీరు మొదటనుండి వినిన ప్రకారము ప్రేమలో నడుచుకొనవలెను అనునదియే ఆ ఆజ్ఞ"* (2 యోహాను 6). దేవుని ఆజ్ఞలను మీరి చేసే "ప్రేమ" నిజమైన ప్రేమ కాదు. అయితే ఈ విధేయత దేవుని ప్రేమను సంపాదించుకోవడానికి కాదు. ఆయన మొదట మనల్ని ప్రేమించారు కాబట్టే మనం లోబడతాం (1 యోహాను 4:19).

కొందరు "అతి ప్రేమ"నే ప్రేమ అనుకుంటారు. కానీ దేవుడు ప్రేమించమన్నారని దొంగను తీసుకొచ్చి ఇంట్లో బీరువా పక్కన పడుకోబెట్టుకోము కదా! యేసుప్రభువు ప్రేమ అలాంటిది కాదు. వ్యభిచారంలో పట్టుబడిన స్త్రీని ఆయన క్షమించారు, కానీ పాపాన్ని విడిచిపెట్టమని

కూడా చెప్పారు: *"అందుకు యేసునేనును నీకు శిక్ష విధింపను; నీవు వెళ్లి ఇక పాపము చేయకుమని ఆమెతో చెప్పెను"* (యోహాను 8:11). ఆయన ప్రేమలో కనికరమూ ఉంది, సత్యమూ ఉంది.

మీరు దేవుని ప్రేమిస్తున్నారని ఆదివారం పాటలలో చెబుతున్నారు. మిగిలిన ఆరు రోజులు మీ నడక ఏమి చెబుతోంది? చాలా రోజులుగా మీరు మాట్లాడని ఆ సహోదరుడు, మీరు ఫోన్ చేయని ఆ అమ్మ, మీరు పట్టించుకోని ఆ పొరుగువాడు గుర్తొస్తున్నారా? ఈ వారం ఆయన ఆజ్ఞకు లోబడి, మీ ప్రేమను మాటలలో కాదు, చేతలలో చూపించండి.

ప్రేమ అంటే విధేయత అని చూశాము. అయితే ఈ సత్యప్రేమలను దోచుకోవడానికి ఎవరైనా వస్తే ఏమి చేయాలి?

మూడవ విధానం: దుర్బోధకుల నుండి సత్యాన్ని కాపాడుకోవాలి

ఒక ఊరికి ఒక చిట్‌ఫండ్ ఏజెంట్ వచ్చాడు. చాలా మర్యాదగా మాట్లాడేవాడు. ఇంటికి వచ్చి టీ తాగేవాడు, పిల్లల పేర్లు గుర్తుపెట్టుకునేవాడు. ఆదివారం చర్చికి కూడా వచ్చేవాడు. "మీ డబ్బు రెండేళ్ళలో రెట్టింపు అవుతుంది" అన్నాడు. ఆ ఊరిలో ఒక విధవరాలు కూతురి పెళ్ళి కోసం పదేళ్ళు కూలి పని చేసి దాచుకున్న డబ్బంతా అతని చేతిలో పెట్టింది. ఒక రోజు ఉదయం అతని ఆఫీసుకు తాళం వేసి ఉంది, ఫోను స్విచ్ ఆఫ్. ఆ రోజు ఆ తల్లి ఏడుపు ఊరంతా విన్నది.

దొంగ ఎప్పుడూ దొంగలా కనపడడు. దుర్బోధకులు కూడా ఎప్పుడూ దుర్బోధకులుగా కనపడరు.

యోహాను ఆ దుర్బోధకులను బయటపెడుతున్నాడు: *"యేసుక్రీస్తు శరీరధారియై వచ్చెనని యొప్పుకొనని వంచకులు అనేకులు లోకములో బయలుదేరి యున్నారు"* (2 యోహాను 7). వాళ్ళు బైబిలు నుండే మాట్లాడారు, కానీ యేసుక్రీస్తు నిజంగా మనుష్యుడై రాలేదని బోధించారు. ఆయన నిజమైన దేవుడు, నిజమైన మనుష్యుడు. ఈ సత్యాన్ని తీసివేస్తే సిలువ

ఉండదు, రక్షణ ఉండదు. ఏ బోధకుడు వచ్చినా మనం అడగవలసిన మొదటి ప్రశ్న ఇదే: "ఈయన యేసుక్రీస్తును గూర్చి ఏమి చెబుతున్నాడు?"

యోహాను సంఘాన్ని ఇలా హెచ్చరిస్తున్నాడు: *"మేము మీ మధ్యను నెరవేర్చిన కార్యములను చెడగొట్టుకొనక మీరు పూర్ణ ఫలము పొందునట్లు జాగ్రత్తగా చూచుకొనుడి"* (2 యోహాను 8). చిట్‌ఫండ్ ఏజెంట్ ఏళ్ళ కష్టాన్ని ఒక్క రోజులో దోచుకున్నట్టే, అపొస్తలులు ఎన్నో సంవత్సరాలు కష్టపడి కట్టిన సంఘాన్ని ఒక తప్పుడు బోధ నాశనం చేయగలదు. సత్యాన్ని కాపాడే బాధ్యత పాస్టరు ఒక్కరిదే కాదు, ప్రతి విశ్వాసిది.

ఆ దుర్బోధకులు తమను తాము "ముందున్నవారిగా" చెప్పుకున్నారు. "మా దగ్గర క్రొత్త వెలుగు ఉంది" అన్నారు. యోహాను జవాబు ఇది: *"క్రీస్తుబోధ యందు నిలిచియుండక దానిని విడిచి ముందునకుసాగు ప్రతివాడును దేవుని అంగీకరింపనివాడు; ఆ బోధయందు నిలిచియుండువాడు తండ్రిని కుమారుని అంగీకరించు వాడు"* (2 యోహాను 9). ఆత్మీయతలో ఎదగడం అంటే క్రీస్తును దాటి ముందుకు వెళ్ళడం కాదు, క్రీస్తులో ఇంకా లోతుగా దిగడం.

అందుకే యోహాను స్పష్టంగా ఆజ్ఞాపిస్తున్నాడు: *"ఎవడైనను ఈ బోధను తేక మీ యొద్దకు వచ్చినయెడల వానిని మీ యింట చేర్చుకొనవద్దు; శుభమని వానితో చెప్పను వద్దు. శుభమని వానితో చెప్పువాడు వాని దుష్టక్రియలలో పాలివాడగును"* (2 యోహాను 10–11). ఆ రోజుల్లో సంఘం విశ్వాసుల ఇళ్ళలోనే కూడుకొనేది. "ఇంట చేర్చుకొనుట" అంటే ఆ బోధకునికి సంఘ వేదిక ఇవ్వడం, అతని పరిచర్యకు ఆశ్రయం ఇవ్వడం. యోహాను నిషేధిస్తున్నది సాధారణ మర్యాదను కాదు, అబద్ధ బోధకు మద్దతును.

మొదట్లో మనం చూసిన చిక్కుముడికి ఇదే జవాబు. ఫిలేమోను పత్రికలో పశ్చాత్తాపపడి తిరిగి వచ్చిన సహోదరుని చేర్చుకోమని దేవుడు చెప్పారు. ఇక్కడ క్రీస్తును తిరస్కరించే బోధకుని చేర్చుకోవద్దని చెబుతున్నారు. ప్రేమకు ఒక హద్దు ఉంది. ఆ హద్దు సత్యం.

అయితే ఒక జాగ్రత్త. దుర్బోధను ఎదిరించే ఉత్సాహంలో మనమే ఆ రెండవ డాక్టర్‌లా మారకూడదు. దుర్బోధకునికి వేదిక మూయండి, కానీ అతని మాటలు నమ్మి మోసపోయిన

సహోదరునికి మీ హృదయం తెరిచే ఉంచండి. వాదనతో కాదు, కన్నీటి ప్రార్థనతో, ప్రేమతో సత్యం చెప్పి అతనిని వెనక్కి తీసుకురండి.

ఈ రోజు కూడా ఇలాంటి బోధలు మన గుమ్మం తడుతున్నాయి. "యేసు దేవుడు కాదు, ఒక దేవదూత మాత్రమే" అనేవారు, "నాకు కానుక ఇస్తే నీకు అద్భుతం జరుగుతుంది" అనేవారు, "పశ్చాత్తాపం అవసరం లేదు" అనేవారు ఇంకా ఉన్నారు. ఇప్పుడు వీరు మన ఫోనులోకి, మన ఫ్యామిలీ వాట్సాప్ గ్రూపులోకి కూడా వస్తున్నారు. ఆలోచించకుండా ఒక వీడియోను "షేర్" చేసినప్పుడు, వారికి మన ఇంటి తలుపు తెరిచినట్టే.

మనం బంగారం కొనడానికి షాపుకు వెళ్తాం. అది ఎంత మెరుస్తున్నా కంసాలి వెంటనే నమ్మడు. ఆ బంగారాన్ని నల్లని గీటురాయి మీద గీస్తాడు. ఆ గీత రంగును బట్టి అది అసలుదో, నకిలీదో చెప్పేస్తాడు. ప్రతి బోధకు మన గీటురాయి యేసుక్రీస్తే. ఈ వారం మీకు వచ్చే ప్రతి సందేశాన్ని షేర్ చేయకముందు, ప్రతి బోధకుని మీ వేదికపైకి ఎక్కించకముందు, ఆ గీటురాయి మీద గీసి చూడండి. ఆ గీటురాయి మీ చేతిలో ఉండాలంటే వాక్యాన్ని మీరే చదవాలి. అసలు నోటు బాగా తెలిసినవాడే దొంగనోటును వెంటనే పట్టుకుంటాడు.

మూడవ డాక్టర్

మనకు కావలసింది సత్యమూ ప్రేమా రెండూ ఉన్న మూడవ డాక్టర్. ఆ డాక్టర్ యేసుక్రీస్తే. *"ఆ వాక్యము శరీరధారియై, కృపాసత్యసంపూర్ణుడుగా మనమధ్య నివసించెను"* (యోహాను 1:14). ఆ డాక్టర్ మన జబ్బును తక్కువ చేసి చెప్పలేదు. అలాగని మనల్ని గద్దించి గుమ్మం బయటికి తోసేయలేదు. మన పాపం నిజమైనదని చెప్పారు, ఆ పాపాన్ని తన శరీరం మీద వేసుకొని సిలువపై మోశారు.

ప్రియులారా, ఈ రోజు మీరు ఏ డాక్టర్‌లా ఉన్నారో గుర్తించారా? అంతకంటే ముందు, మీరు కూడా ఒక రోగి అని గుర్తించారా? మొదట ఆ మూడవ డాక్టర్ దగ్గరకు మీరే రండి. ఆయన మీ పాపాన్ని దాచిపెట్టరు, మిమ్మల్ని వెళ్ళగొట్టరు. క్షమించి, స్వస్థపరచి, సత్యప్రేమలలో నడిచే

బలం ఇస్తారు. ఈ రోజు మనసారా ఇలా ప్రార్థిద్దాం: “ప్రభువా, నా ప్రేమకు సత్యాన్ని, నా సత్యానికి ప్రేమను ఇమ్ము.”

యోహాను ఈ పత్రికను హెచ్చరికతో కాదు, *“మీ సంతోషము పరిపూర్ణమవునట్లు”* ముఖాముఖిగా కలవాలనే ఆశతో ముగిస్తున్నాడు (2 యోహాను 12). ఒక రోజు మన ప్రభువైన యేసుక్రీస్తును కూడా మనం ముఖాముఖిగా చూస్తాము. ఆ రోజు వరకు సత్యములోను ప్రేమలోను నడుచుకుందాం.

ప్రేమ చేయి పట్టుకుంటుంది, సత్యం దారి చూపిస్తుంది. రెండూ కలిసిన చోటే క్రీస్తు కనిపిస్తారు.

Pastor John Prabhu Kiran,
Senior Pastor - IBM Church,
Professor of Theology - Andhra Bible College

andhrabiblecollege.in/read